


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 174 | శుక్రవారం 12 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్...

- ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ
- వాణిజ్యం, రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారంపై సమీక్ష
- త్వరలో భారత్‌లో పర్యటిస్తానని ఇటీవల వ్యాఖ్యానించిన ట్రంప్
- మోదీ గొప్ప నాయకుడని, తన స్నేహితుడని ప్రశంసలు



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 11**

భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయనడానికి సూచికగా, ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం టెలిఫోన్ సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాల పురోగతితో పాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించుకున్నారు. ఇరు దేశాల

- మిగతా 2లో..

## అమిత్ షా ఆందోళనగా కనిపించారు

- చేతులు కూడా వణికాయి: రాహుల్ గాంధీ
- ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పలేదని విమర్శ
- నేను చేసిన వ్యాఖ్యలపై సభలో చర్చిద్దామంటే సమాధానం రాలేదని వెల్లడి



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 11**

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిన్న ఆందోళనగా కనిపించారని, ఆయన ఉపయోగించిన భాష కూడా సరిగా లేదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా నిన్న మాట్లాడిన విషయం తెలిసిందే. ఆయన ప్రసంగంపై ఈరోజు రాహుల్ గాంధీ మాట్లాడుతూ, అమిత్ షా నిన్న కంగారుగా కనిపించారని అన్నారు. ప్రసంగం సమయంలో అమిత్ షా చేతులు కూడా వణుకుతూ కనిపించాయని, ఏ ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానం చెప్పలేదని

- మిగతా 2లో..

## శీతాకాల విడిది కోసం
# హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము...

- డిసెంబర్ 17 నుంచి 21 వరకు సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో బస
- రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- పాములు, కోతుల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశం



**హైదరాబాద్– సూర్య వాస్తవం, డిసెంబర్ 11**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌లో ఐదు రోజుల పర్యటనకు రానున్నారు. తన వార్షిక శీతాకాల విడిదిలో భాగంగా డిసెంబర్ 17 నుంచి 21 వరకు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఆమె బస చేయనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

- మిగతా 2లో..

## ఇండిగో సంక్షోభం...
# సీఈఓకు మరోసారి డీజీసీఏ సమన్లు

- ఇండిగో కార్యకలాపాలపై 8 మంది సభ్యులతో ప్రత్యేక నిఘా బృందం
- ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పిన ఇండిగో చైర్మన్
- సమస్య మూలాలను కనుగొనేందుకు బయటి నిపుణుల సహాయం
- ప్రస్తుతం రోజుకు 1,950కి పైగా విమానాలు నడుపుతున్నామని వెల్లడి




**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 11**

దేశీయ విమానయాన రంగంలో తీవ్ర గందరగోళానికి కారణమైన ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కఠినంగా వ్యవహరిస్తోంది. వేలాది విమానాల రద్దు, ఆలస్యంపై వివరణ ఇచ్చేందుకు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్‌ను మరోసారి తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. ఇప్పటికే ఈ వారం ఒకసారి డీజీసీఏ అధికారుల ముందు హాజరైన ఎల్బర్స్‌ను, ఈసారి నలుగురు సభ్యుల బృందం విచారించనుంది.

- మిగతా 2లో..




### ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ గడువు పెంపు

- బెంగాల్‌లో మార్పు లేదు

2లో

## పరిశోధనలకు కేంద్రంగా
# క్వాంటం వ్యాలీ

- అమరావతిలో గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ఏర్పాటుకు ప్రతిపాదన
- నూతన ఔషధాల పరిశోధనల కోసం రూ.200 కోట్ల పెట్టుబడి
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో పరిశోధకులు, విద్యావేత్తల బృందం భేటీ
- క్వాంటమ్ వ్యాలీని ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారుస్తామన్న సీఎం

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11**




దేశంలోనే తొలి క్వాంటం బయోమెడికల్ రీసెర్చ్ ఎకోసిస్టంగా రూపకల్పన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, అత్యాధునిక సాంకేతిక పరిశోధనలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న 'క్వాంటమ్ వ్యాలీ'ని వేదికగా చేసుకొని, నూతన ఔషధాలు, మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలు చేసేందుకు 'గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ' ముందుకొచ్చింది. రూ. 200 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పలు దేశాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో కూడిన బృందం

- మిగతా 2లో..



## బాధితులకు అండగా ఉంటాం

- విజయవాడ జోజినగర్ బాధితులతో జగన్
- వచ్చే వారం పర్యటిస్తానని హామీ

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11**

విజయవాడలో ఇళ్లు కూల్చివేసిన జోజినగర్‌కు వచ్చే వారం వస్తానని, బాధితులకు అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల జోజినగర్లో 42 ప్లాట్లు కూల్చివేసిన సంగతి తెలిసింది. యజమానులందరూ గురువారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన జగన్‌ను కలిశారు. రెక్కల కష్టంతో 25 సంవత్సరాల క్రితమే తాము ఇళ్లు నిర్మించుకున్నామని, ప్లాట్ రిజిస్ట్రేషన్, ప్లాను, ఇంటిపన్ను, కరెంటు బిల్లులూ ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ వరకూ మా ప్లాట్ల జోలికి రావద్దని సుప్రీం కోర్టు కూడా చెప్పిందని, అయినా డిసెంబర్3న వేకువజామున వందల మంది పోలీసులు వచ్చి ఒక్కసారిగా కూల్చివేశారని తెలిపారు. ఇళ్లను కూల్చివేసి ఎంపిగానీ, ఎమ్మెల్యేగానీ పరామర్శకు రాలేదని పేర్కొన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలంటే ప్రభుత్వానికి కడుపుమంటగా ఉందని,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఇఆర్‌సి ప్రతిపాదనలపై
# సీఎం స్పందించాలి

- పీసీసీ చీఫ్ వై.ఎస్ షర్మిల

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11**



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడకు చిత్తశుద్ధి ఉంటే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపిఇఆర్‌సి) రూపొందించిన ప్రతిపాదనలపై తక్షణమే స్పందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రూ.15 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తున్నట్లు ప్రకటన చేయాలని కోరారు. గతంలో ప్రజలపై మోపిన మరో రూ.15 వేలు కోట్ల సర్దుబాటు ఛార్జీలను సైతం

- మిగతా 2లో..

# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్...

(మొదటిపేజీ తరువాయి)

మధ్య వాణిజ్యాన్ని పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కొనసాగించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "అధ్యక్షుడు ట్రంప్‌తో చాలా ఆత్మీయంగా, ఫలవంతంగా సంభాషణ జరిగింది. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించాం. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించాం. ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేయడం కొనసాగిస్తాయి" అని పేర్కొన్నారు.

'భారత్-అమెరికా సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం'లో పురోగతిని నేతలిద్దరూ సమీక్షించారు. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారం నిలకడగా బలపడుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'ఇండియా-యూఎస్ కాంపాక్ట్' అమలులో భాగంగా కీలకమైన సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత వంటి ప్రాధాన్యతా రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉమ్మడి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు. ఇదిలా ఉండగా, గత నెలలో ట్రంప్ ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీని "గొప్ప వ్యక్తి", "నా స్నేహితుడు" అని అభివర్ణిస్తూ, త్వరలోనే భారత్‌లో పర్యటించాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. నవంబర్ 6న వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "మోదీ నా స్నేహితుడు, మేం మాట్లాడుకుంటాం. నన్ను అక్కడికి రమ్మని కోరుతున్నారు. నేను వెళతాను" అని అన్నారు. 2020లో తన భారత పర్యటన అద్భుతంగా జరిగిందని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. భారత్‌తో వాణిజ్య చర్చలు చాలా సానుకూలంగా సాగుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ కూడా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ పట్ల ట్రంప్‌కు గొప్ప గౌరవం ఉందని, ఇరువురు నేతలు తరచుగా మాట్లాడుకుంటారని ఆమె తెలిపారు. వాణిజ్య అంశంపై భారత ప్రతినిధులతో తమ బృందం ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోందని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా జరిగిన ఫోన్ సంభాషణ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

# అమిత్ షా ఆందోళనగా కనిపించారు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. తాను మాట్లాడిన వాటికి వేటికీ ఆధారం చూపించలేదని అన్నారు. మీడియా ముందు తాను చేసిన వ్యాఖ్యలన్నింటినీ పార్లమెంటులో చర్చిద్దామని ఆయనకు సవాల్ విసిరినప్పటికీ ఆయన నుంచి సమాధానం రాలేదని అన్నారు.

**రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి విమర్శలు**

పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతున్నప్పుడల్లా రాహుల్ గాంధీ బయటకు వెళ్లిపోతారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. రాహుల్ గాంధీ హిట్ అండ్ రన్ ఫార్ములాను అనుసరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే ఇదేనేమో అని చురక అంటించారు. భవిష్యత్తులో ఆయన తన అలవాటును మానుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము...

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పటిష్టమైన భద్రత, ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ శాఖను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ టెండర్లు, ప్రత్యేక వైద్య బృందాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల సమన్వయంతో రోడ్లకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో 24 గంటలూ పాములు పట్టే బృందాన్ని సిద్ధంగా ఉంచాలని ప్రత్యేకంగా సూచించారు. కోతుల బెడదను, తేనెటీగల సమస్యను నివారించేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు వికాస్ రాజ్, సీపీ ఆనంద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఏటా శీతాకాలంలో రాష్ట్రపతి హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేసి, ఇక్కడి నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది.

# ఇండిగో సంక్షోభం... సీఈఓకు మరోసారి డీజీసీఏ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

అసలు సమస్య ఎక్కడ తలెత్తిందో తెలుసుకునేందుకు డీజీసీఏ ఇప్పటికే ఎనిమిది మంది సభ్యులతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలోని ఇద్దరు అధికారులు ఇండిగో కార్పొరేట్ కార్యాలయంలోనే ఉండి రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. మరోవైపు, ఈ సంక్షోభంపై ఇండిగో చైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా స్పందిస్తూ ప్రయాణికులకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పారు. డిసెంబర్ 3 నుంచి 5 మధ్య జరిగిన అంతరాయాల వల్ల వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ముఖ్యమైన వ్యక్తిగత కార్యక్రమాలు, వ్యాపార సమావేశాలు, వైద్య అపాయింట్‌మెంట్‌లు కోల్పోయారని అంగీకరించారు. "జరిగిన దానికి మేము నిజంగా చింతిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి భారీ వైఫల్యాలు పునరావృతం కాకుండా చూసేందుకు బయటి సాంకేతిక నిపుణుల సహాయం తీసుకోనున్నట్లు మెహతా హామీ ఇచ్చారు. సమస్య మూల కారణాలను కనుగొనేందుకు ఈ నిపుణుల బృందం యాజమాన్యంతో కలిసి పనిచేస్తుందని వివరించారు. ప్రస్తుతం కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయని, గురువారం 1,950కి పైగా విమానాలను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇండిగో తెలిపింది.

# పరిశోధనలకు కేంద్రంగా క్వాంటం వ్యాలీ




(మొదటిపేజీ తరువాయి)

సమావేశమై తమ ప్రతిపాదనలను వివరించింది. ఈ సందర్భంగా గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ప్రతినిధులు మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఈ కేంద్రం దేశంలోనే తొలి క్వాంటమ్ బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా నిలుస్తుందని తెలిపారు. మాలిక్యులర్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ సిమ్యులేషన్స్, మెటీరియల్ సైన్స్ వంటి క్లిష్టమైన రంగాల్లో తమ పరిశోధనలు సాగుతాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ ప్రభుత్వ విధానాలు, క్వాంటం వ్యాలీ ఏర్పాటు వంటి అంశాలు తమను ఎంతగానో ఆకర్షించాయని వారు పేర్కొన్నారు.

ఈ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యారోగ్యం, ఔషధాల తయారీ వంటి రంగాల్లో విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. క్వాంటమ్ పరిశోధనల ద్వారా బయోసెన్సార్ల వంటి అప్లికేషన్లను అభివృద్ధి చేసి, వాటి ఫలాలను ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గతంలో ఐటీ, జీనోమ్ వ్యాలీ వంటివి ఎలా విజయవంతమయ్యాయో, ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ కూడా అదే స్థాయిలో నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే అమరావతిలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రం (ఏక్యూసీసీ) కార్యకలాపాలు ప్రారంభిస్తుందని చంద్రబాబు తెలిపారు. జాతీయ క్వాంటమ్ మిషన్‌ను అందిపుచ్చుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళుతోందని వివరించారు. క్వాంటమ్ బయో ఫౌండ్రీ ఏర్పాటు ఒక వినూత్న ఆలోచన అని అభినందించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, రవాణా

వంటి కీలక రంగాల భాగస్వాములందరూ క్వాంటమ్ వ్యాలీ సేవలను వినియోగించుకునేలా ఒక సమగ్ర ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలకు ఇది కీలక కేంద్రంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

# నేడు విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పర్యటన...

**కాగ్నిజెంట్, సత్వా క్యాంపస్‌లకు భూమి పూజ**
- **విశాఖలో కాగ్నిజెంట్, సత్వా గ్రూపు భారీ పెట్టుబడులు**
- **రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న సీఎం, మంత్రి లోకేశ్**
- **మరో 7 ఐటీ క్యాంపస్ లకు కూడా భూమిపూజ చేయనున్న లోకేశ్**
- **రూ.3000 కోట్లకు పైగా పెట్టుబడులు, 33 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు**
- **ఐటీ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగు**



**అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 11**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విశాఖపట్నం ఐటీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. నగరాభివృద్ధిలో కీలక మైలురాళ్లుగా నిలిచే రెండు భారీ ప్రాజెక్టులకు రేపు (డిసెంబరు 12) శ్రీకారం చుట్టనున్నారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్‌తో పాటు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ తమ క్యాంపస్‌ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా విశాఖలో రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడులు రానుండగా, ప్రత్యక్షంగా 33 వేలకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. విశాఖ కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాల్లో నిర్మించనున్న కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తారు. ఈ సంస్థ రూ.1,583 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఈ క్యాంపస్‌ను నిర్మించనుంది. దీని ద్వారా 8 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2033 నాటికి నిర్మాణం పూర్తి కానుండగా, మొదటి దశను 2029 నాటికి పూర్తి చేసి 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు.

ఈ నేపథ్యంలో, రుషికొండలోని మహతి ఫిన్ టెక్ భవనంలో వెయ్యి సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలపై దృష్టి సారిస్తుంది. మరోవైపు, దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ విశాఖ మధురవాడలోని హిల్-4లో నిర్మించనున్న 'సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్'కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా 40 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ క్యాంపస్‌లో కేవలం ఐటీ కార్యాలయాలే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో నివాసాలు, రిటైల్, హాస్పిటాలిటీ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో భారీ ప్రాజెక్టులు నిర్మించిన సత్వా గ్రూప్, విశాఖలో రాబోయే ఐదేళ్లలో 4 మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖపట్నం త్వరలోనే గ్లోబల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ తో పాటు విశాఖపట్నంలో మరో 7 ఐటీ సంస్థల క్యాంపస్ ల నిర్మాణాలకు కూడా నారా లోకేశ్ రేపు భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు.

# బాధితులకు అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

వారిపట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందని తెలిపారు. సామాన్లు బయటకు తెచ్చుకునే అవకాశం కూడా లేకుండా కూల్చివేశారని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవాలను పర్యవేక్షించడానికి తపనపడిన ఎంపి ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శించేందుకు సమయం కేటాయించడం లేదని విమర్శించారు. బాధితుల వినతిమేరకు వారిని మాజీ సిఎం జగన్ వద్దకు తీసుకువచ్చాని తెలిపారు. దీనిపై పలువురు బాధితులు కూడా మాట్లాడుతూ అనంతరం జగన్ మాట్లాడుతూ వారం రోజుల్లో జోజినగర్ ప్రాంతంలో ఇళ్లు కూల్చివేసిన ప్రాంతాన్ని సందర్శిస్తానని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ వదిలేది లేదని అన్నారు.

**అప్పన్న వేమిరెడ్డి ఉద్యోగి- పుత్తా శివశంకర్‌రెడ్డి**

అప్పన్న అనే వ్యక్తి వేమిరెడ్డి దగ్గర ఉద్యోగని, రెండేళ్ల నుండి అతనివద్ద జీతం తీసుకుంటున్నారని వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఆయనకు విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి జీవం వెళుతోందని, ప్రతినెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా వేతనం జమవుతోందని అన్నారు.

# ఇఆర్‌సి ప్రతిపాదనలపె సీఎం స్పందించాలి

(మొదటిపేజీ తరువాయి)

రద్దు చేయాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ చార్జీల పెంపుపై ఎపిఇఆర్‌సి ప్రతిపాదనలకు, ముఖ్యమంత్రి ప్రకటనలకు పొంతన లేదన్నారు. రూ.15,651 కోట్ల మేర చార్జిల వడ్డనకు ఎపిఇఆర్‌సి సర్వం సిద్ధం చేస్తుంటే, బిల్లులు పెంపుపై ప్రజాభిప్రాయానికి ప్రకటన ఇచ్చినా, చార్జీల భారం పడదని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. అధికారం చేపట్టిన ఏడాదిన్నరలోనే జనాలకు సర్దుబాటు పేరుతో గుండెపోటు తెప్పించారు. చంద్రబాబు మాటలు నమ్మి ఓట్లు వేసిన పాపానికి రాష్ట్ర ప్రజలకు ఏడాదికో హై టెన్షన్ షాక్ ఇస్తున్నారని విమర్శించారు.

# ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ గడువు పెంపు

## - బెంగాల్‌లో మార్పు లేదు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 11**

ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు గడువును ఎన్నికల కమిషన్ గురువారం పొడిగించింది. కొత్త గడువు ప్రకారం తమిళనాడుకు ఓటర్ల జాబితా ముసాయిదాను డిసెంబరు 19న ప్రచురించాల్సి వుంది. అలాగే అండమాన్ నికొబార్ దీవులకు, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లకు డిసెంబరు 23న, ఉత్తరప్రదేశ్‌కు డిసెంబరు 31న ప్రచురించాల్సి వుందని సవరించిన షెడ్యూల్ పేర్కొంది. కాగా పశ్చిమ బెంగాల్ విషయంలో ఎలాంటి మార్పు చేయలేదు. దీంతో తమిళనాడు, గుజరాత్‌లకు ఎన్యూమరేషన్ ఫారం అందచేయాల్సిన తుది తేదీ డిసెంబరు 14గా వుంది. అండమాన్, నికొబార్ దీవులు, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లకు డిసెంబరు 18 కాగా, ఉత్తరప్రదేశ్‌కు డిసెంబరు 26గా వుంది. గతంలో కేరళ షెడ్యూల్‌ను సవరించామని, ఎన్యూమరేషన్ ఫారాలను అందచేసే తేదీ డిసెంబరు 18 కాగా, ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ డిసెంబరు 23గా వుందని ఇసి పేర్కొంది. గోవా, గుజరాత్, లక్షద్వీప్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందచేసేందుకు చివరి తేదీ గురువారంతో ముగిసింది. డిసెంబరు 23నిక్కడ ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురించాల్సి వుంది. ఈ ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు గురువారం(11వతేదీ) తోనే ముగిసింది. డిసెంబరు 16న ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురించాల్సి వుంది.

# సంపాదకీయం

## రెంటికి చెడ్డ రేవడిలా మమత



పశ్చిమ బెంగాల్‌లో తిరుగులేని నేతగా ఎదిగారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ. కమ్యూనిస్టుల కంచుకోటను 15 ఏళ్లక్రితం బద్దలు కొట్టి అధికారం చేపట్టారు. వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఇటీవలే జరిగినట్లు అనిపిస్తోంది. వెస్ట్? బెంగాల్? శాసన సభకు ఎన్నికలు జరిగి దాదాపు ఐదేండ్లు గడిచిపోయాయి. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్? శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 2026 పశ్చిమ బెంగాల్ స్టేట్? ఎన్నికలు హోరాహోరీగా చాలా పెద్ద పోరాటాన్ని తలపించే విగా ఉంటాయి. గొప్ప ఫ్రెంచ్ రచయిత జీన్ అల్ఫోన్స్ కర్ ఇలా అన్నారు.. ' కొన్ని విషయాలు ఎంతగా మారినా మరికొన్ని విషయాలు అంతకంటే ఎక్కువగా యథాతథంగా అలాగే ఉంటాయి'. ఇది వెస్ట్? బెంగాల్ రాజకీయాలకు పూర్తిగా వర్తిస్తుంది. 2000 నుంచి తృణమూల్? కాంగ్రెస్? అధినేత్రి మమతా బెనర్జీ, బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి, అదే కాంగ్రెస్ నాయకులు, అదే కమ్యూనిస్ట్ నాయకులు బెంగాల్ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తృ ణమూల్? కాంగ్రెస్? చీఫ్? మమతా బెనర్జీ 2011 నుంచి పశ్చిమబెంగాల్? ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. 1977 నుంచి ఏకధాటిగా పశ్చిమ బెంగాల్?ను పాలిస్తున్న వామపక్ష ప్రభుత్వాన్ని మమతా బెనర్జీ అనూహ్యంగా ఓడించారు. ఇది ఒక సూపర్? హ్యూమన్ ? టాస్క్?. తృణ మూల్? కాంగ్రెస్? అధినాయకురాలు మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీని కూడా వెస్ట్? బెంగాల్?లో పూర్తిగా నాశనం చేసింది. 2021లో జరిగిన పశ్చిమ బెంగాల్? రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గెలవకుండా మమతా బెనర్జీ అడ్డుకోగలిగారు. ఆమెకు ఎదురు నిలిచిన రాజకీయ శత్రువులు మొత్తం కనుమరుగై పోయారని మమతా బెనర్జీ భావిస్తున్న తరుణంలో.. అకస్మాత్తుగా వెస్ట్? బెంగాల్?లో బీజేపీ ఒక బలమైన రాజకీయ శక్తిగా మారింది. ఇప్పుడు బీజేపీ పశ్చిమ బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. . అయితే ప్రతీ ఎన్నికల్లో మమతాబెనర్జీ పార్టీకి బెంగాల్‌లోని ముస్లింలు అండగా నిలిచారు. దీంతో మమతా కూడా సహజంగానే ఇంతకాలం వారికి అనుకూలంగా వ్యవహరించారు. అయితే ముస్లింలో మెజారిటీ ప్రజలు బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వలస వచ్చినవారే. అయినా వారిని మమతా పెంచి పోషించారు. అయితే తాజాగా ముర్షిదాబాద్‌లో తృణమూల్ ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ బాబ్రీ మసీదు నిర్మాణానికి ముందుకొచ్చి పార్టీకి సవాలు విసిరాడు. స్థానికులు భారీగా విరాళాలు, సామగ్రి సమర్పించడంతో విషయం విస్తరించింది. మమతా బెనర్జీ వెంటనే ఆయన్ను పార్టీ నుంచి తొలగించి డామేజ్ కంట్రోల్ చేస్తూ తీవ్ర చర్య తీసుకున్నారు. దీంతో హిందువుల్లో సానుభూతి పెరిగింది. బాబ్రీ కూల్చివేతకు వ్యతిరేకంగా ముస్లిం సమాజం నిరసనలకు మమతాబెనర్జీ అనుమతి ఇచ్చారు. ఇది వ్యూహాన్ని సంక్లిష్టం చేసింది. ఒకవైపు మసీదు నిర్మాణాన్ని అడ్డుకుని హిందువులకు అనుకూలంగా వ్యవరించి.. మైనారిటీలకు వ్యతిరేకమయ్యారు. ఇదే సమయంలో బాబ్రీ కూల్చివేత వ్యతిరేక ర్యాలీకి అనుమతి ఇచ్చి.. హిందువుల్లో ఉన్న సానుభూతి పోగొట్టుకున్నారు. ఎంఐఎంతోపాటు బెంగ్లాలోని మతగురువుల మద్దతులో ఎంఐఎం వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తే ముస్లిం ఓట్లు విభజనకు దారితీస్తాయని మమతా ఆందోళన చెందుతున్నారు. తాను పెంచిన నేతలు మతోన్మాద రూపం తీసుకుంటే పార్టీ ఆధిపత్యం దెబ్బతింటుంది. వచ్చే ఎన్నికల్లో ఈ సంఘటనలు ప్రభావం చూపి కూటమి అధికారాన్ని బెంగాల్‌లో ఇబ్బంది పెట్టవచ్చు. మమతా బెనర్జీ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడిన ఎలక చందంగా మారింది. పార్టీ అంతర్గత ఘర్షణలు, మత రాజకీయాల సంక్లిష్టతను తెలియజేస్తోంది. మైనారిటీ మద్దతును కాపాడుకుంటూ మెజారిటీ సానుభూతిని కోల్పోకుండా సమతుల్యత అవసరం. ఈ వివాదం తృణమూల్ భవిష్యత్ వ్యూహాలను పునఃపరిశీలించేలా చేస్తుంది. 2021లో బీజేపీతో జరిగిన తీవ్ర పోరాటం తర్వాత మమతా బెనర్జీ బెంగాల్ ఎన్నికలలో విజయం సాధించి ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో నాలుగు ప్రాథమిక రాజకీయ శక్తులు ఉన్నాయి. అవి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్? కాంగ్రెస్? పార్టీ, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, లెఫ్ట్ ఫ్రంట్. పశ్చిమ బెంగాల్?లో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుల లెఫ్ట్? ఫ్రంట్?లకు కచ్చితమైన చిన్న ఓటు బ్యాంకులు ఉన్నాయి. బెంగాల్‌లో బీజేపీ వేగంగా అభివృద్ధి చెందడం ప్రారంభించింది. 2021 రాష్ట్ర ఎన్నికలలో బీజేపీ 296 మంది ఎమ్మెల్యే స్థానాల్లో 77 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంది, ఇది బీజేపీకి భారీ లాభం. బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేస్తోంది. బహుశా బీజేపీ 2021 కంటే ఎక్కువ ఎమ్మెల్యేలను గెలుచుకునే అవకాశం ఉంది. కానీ 28% ముస్లిం జనాభా ఉన్నందున బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోవడం కష్టం. పశ్చిమ బెంగాల్‌లో నరేంద్ర మోదీ ప్రజాదరణ గణనీయంగా పెరిగింది. తమ రాష్ట్రం అక్రమ వలసదారులతో నిండిపోయిందని బెంగాలీ హిందువులు ఆందోళన చెందుతున్నారు. బెంగాలీలు కూడా తమ సంస్కృతిని మార్చుకోవాలని, పరిశ్రమలను స్వాగతించాలని తెలుసు. బెంగాలీలలో మార్పు నెమ్మదిగా వస్తోంది. కానీ, చారిత్రాత్మకంగా బెంగాల్ కూడా కొత్త ఆలోచనలకు తెరతీసింది. బీజేపీ వంటి జాతీయ పార్టీకి ఓటు వేయాలా వద్దా అని బెంగాలీలు నిశ్శబ్దంగా అంచనా వేస్తున్నారని చెప్పవచ్చు. అస్సాంలోలాగ బెంగాల్ రాజకీయాలను విదేశీయులు నిశ్శబ్దంగా నియంత్రిస్తున్నారనే ఆందోళన కూడా ఉంది. పశ్చిమ బెంగాల్‌లోనూ మార్పు రావొచ్చు, కానీ.. నెమ్మదిగా!వెస్ట్? బెంగాల్‌లో దాదాపు 28% జనాభా కలిగిన మైనారిటీ ఓటుబ్యాంకు ఉంది. ఒకప్పుడు ఈ మైనారిటీ ఓటు బ్యాంకు కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అండగా వెన్నుదన్నుగా ఉండేది. కానీ ఇప్పుడు, ముస్లిం ఓటర్లు మమతా బెనర్జీ పార్టీ తృణమూల్? కాంగ్రెస్? వైపు మారారు. ఎందుకంటే ముస్లిం మైనారిటీ ఓటర్లు ఆమెను బీజేపీని ఓడించగల రాజకీయ శక్తిగా చూస్తున్నారు.

# ఘనంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వేడుకలు

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ షేక్ మహమ్మద్ షా**



**హైదరాబాద్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** హైదరాబాద్ నగరంలో "షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్" ఆధ్వర్యంలో బుధవారం 77 వ ఇంటర్నేషనల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ మహమ్మద్ షా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మానవ హక్కుల కు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడి పైన ఉందని ఆయన తెలిపారు. ఎక్కడైతే మానవ హక్కులు హరించబడుతాయో అక్కడ ప్రజల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని, ఈ విషయం ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ప్రజలకు ఎక్కువగా పోలీస్ స్టేషన్లలో మానవ హక్కుల ఉల్లంఘన ఎక్కువ జరుగుతున్నదని దీనిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎలాంటి అధికారు లైన చట్టాన్ని అనుసరించి పనిచేయాలని లేనిపక్షంలో ప్రజల తరఫున తమ సంస్థ ముందుండి ప్రజల హక్కులు కాపాడడం లో,హక్కుల కోసం పోరాటంలో, ఎల్లవేళలా ఈ సంస్థ అందుబాటులో ఉంటుంది అని ఆయన తెలిపారు. మానవ హక్కులు, సామాజిక న్యాయం మరియు అందరికీ సమానత్వం కోసం పోరాడడం కోసమే ఈ "సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్" సంస్థ స్థాపించామన్నారు. తమ సంస్థలో ఐఏఎస్ అధికారులు, మాజీ జడ్జీలు, సిఐడి అధికారులు, ప్రముఖ సీనియర్ హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, సీనియర్ జర్నలిస్టులు, సేవా భావం కలిగిన డాక్టర్లు ఇలా ప్రతి రంగంలో ప్రముఖ వ్యక్తులు తమ సంస్థలో ఉన్నారన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో కూడా చాలామంది ప్రజలకు మానవ హక్కుల గురించి సరైన అవగాహన లేకుండా ఉందన్నారు. తమ సంస్థ



కార్యక్రమాల ద్వారా ప్రజల హక్కుల గురించి తెలుపుతున్నామన్నారు. ప్రజల పట్ల అన్యాయం, దౌర్జన్యం, నిర్లక్ష్యం వహించే వారి పట్ల తమ సంస్థ సింహా స్వప్నం లా మారుతుంది అన్నారు. అలాగే ప్రజలకు వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే వారిని శిక్షకు గురిచేసి న్యాయస్థానం ముందు నిలబెడతామని ఆయన తెలిపారు. తమ సంస్థ భవిష్యత్తు కార్యాచరణ ప్రజల కోసం చాలా కఠినంగా ఉంటుంద అని తెలిపారు. తమ సంస్థ హ్యూమన్ రైట్స్ సభ్యులు అతి తక్కువ కాలంలో ప్రజల్లో చొచ్చుకొని పోయి విరి విరిగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. సివిల్ కేసులు, రాజీ కాదగ్గ వివాహ సంబంధ తగువులు, మనోవర్తి, గృహహింస వంటి కేసుల న్యాయ సలహా కోసం, పరిష్కారం కోసం తమ ఈ షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

**ఆంధ్ర ప్రదేశ్ సోషల్ మీడియా ఇన్చార్జ్ "షేక్ జైనుల్'ను వరించిన"యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్" అవార్డు**

కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ సోషల్ మీడియా ఇన్చార్జ్ "షేక్ జైనుల్"యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్"అవార్డు కి ఎంపికయ్యారు. చైర్మన్ మహమ్మద్ షా చేతుల మీదు గా అవార్డు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ప్రోత్సాహానికి, రక్షణ,పురోగతికి తోడ్పాటు అందించినందుకు నన్ను ఈ అవార్డుకి ఎంపిక చేయడం చాలా ఆనందకరం గా ఉందని,మా చైర్మన్ తో పాటు అతిరథుల సమక్షంలో అవార్డు తీసుకోవడం నాకు గర్వకారణంగా ఉన్నదని తెలిపారు.

ఈ ప్రోత్సాహంతోనే నాకిచ్చిన పదవి ద్వారా సంస్థ కార్యకలాపాలను భారతదేశ ప్రతి ఒక్క పౌరుడికి తెలిసేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, ప్రొద్దుటూరు హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు,నేషనల్ కాండిట్ క్రాప్ (ఎన్ సి సి) విద్యార్థినీ, విద్యార్థులు పలువురు పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** రాష్ట్రంలో రెడ్ బుక్కు రాజ్యాంగం ఇంకా అమలు అవుతూనే ఉందని, కర్మ ఫలాలు అనుభవించక తప్పదని, అభివృద్ధి అంటేనే జగన్ అంటేనే అభివృద్ధి అని, కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని, జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యం అని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన నివాస ప్రాంగణంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్న రాష్ట్రంలో ఇంతవరకు అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రంలో ఇంకా వైకాపా నాయకుల పై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమే అని చేతల ప్రభుత్వం కాదని ఆయన అన్నారు. రైతుల సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు.రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా ప్రభుత్వం కల్పించలేదని ఆయన అన్నారు.ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకపోవడం ఏమిటి అన్నారు. నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి పెండింగ్లో ఉన్న పనులు ఇంతవరకు పూర్తి చేయడంలో విఫలమైంద న్నారు. జగనన్న రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తే వాటిని కూడా ప్రైవేట్ పరం చేయాలని కూటమి ప్రభుత్వం చూడడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలోనే ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి కావడం జరిగిందన్నారు. వచ్చిన మెడికల్ షీట్లను వినికి పంపించినది కూటమి ప్రభుత్వమే అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తే వైకాపా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయ న్నారు. అంతకు ముందుగా పులివెందులని యోజకవర్గం ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు ఆయననుకలిసి వినతి పత్రాలను అందజేశారు. మరి కొంతమంది సమస్యలను ఆయనకు నేరుగా వివరించారు. ఆయన వారి సమస్యలను సావాదానంగా విని వారి సమస్యలను పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తా అన్నారు. మరి కొంతమంది సమస్యలను అధికారులతో శరవాణిలో మాట్లాడి పరిష్కరింపజేశారు.

# ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**ఆదోని - సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం వార్షిక తనిఖీ చేసి రికార్డు లను పరిశీలించారు.ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ కేసులను చేధించాలన్నారు. రికవరీలు చేయాలన్నారు.విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు.బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం





చూపాలన్నారు. సైబర్ నేరాల పై, మహిళల చట్టాల పై ప్రజలకు అవగాహన చేయాలన్నారు. పోలీసు సిబ్బంది యొక్క సంక్షేమం గురించి, వారి సమస్యలను ఆరా తీశారు. సిబ్బందికి సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.జిల్లా ఎస్పీ తో పాటు ఆదోని డిఎస్పీ హేమలత, డిసిఆర్ బి సిఐ గుణశేఖర్ బాబు, ఆదోని ఒకటవ పట్టణ సిఐ శ్రీరామ్ , ఎస్సై సమీర్ బాషా , పోలీసు సిబ్బంది ఉన్నారు.

## వైసీపీ గ్రామ వార్డు కమిటీల బలోపేతం దిశగా అడుగులు

**- జోరుగా వైసీపీ సంస్థాగత కమిటీలు**



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** వైసీపీ సంస్థాగత కమిటీల నియామకాలు వేగవంతమయ్యా యని పులివెందుల పురపాలక ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. వాటిలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుల వైయస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ వార్డ్ కమిటీల బలోపేతం దిశగా పులివెందుల మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పలు వార్డులలో గురువారం మునిసిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, ఛైర్మన్ వరప్రసాద్ పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్ లక్ష్మీ భార్గవి లక్ష్మీ ,ప్రసన్న, వార్డ్ ప్రజల అధ్యక్షతన సీనియర్ నాయకుల తో కలిసి వార్డ్ కమిటీల నియామక ప్రక్రియ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వార్డులకు సంబంధించిన బూత్, వార్డు, అనుబంధ కమిటీల నియామక ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. వార్డు అధ్యక్షులతో సమా వేశాలు నిర్వహిస్తూ, కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఇస్తూ నివేదికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంగిరెడ్డి, చంద్రమౌళి, శ్రీరామ్ సుబ్బయ్య వైసిపి మహిళలు వైసిపి నాయకులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా

**- పులివెందుల అర్బన్ ఎస్ఐగా తిమోతి బాధ్యతల స్వీకరణ**



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** పులివెందుల అర్బన్ ఎస్ఐ తిమోతి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కలసపాడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించగా బదిలీలో కారణంగా పులివెందుల ఎస్ఐగా బదిలీ కావడం జరిగిందని తెలియజేస్తూ, వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోఉంటూ ప్రజా సమస్యల పరిష్కరిస్తానని, అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శు భాకాంక్షలు తెలిపారు. పులివెందుల అర్బన్ స్టేషన్లో పనిచేసిన ఎస్ఐ విష్ణు నారాయణ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్ళారని తెలిపారు.

## ఘనంగా భాగవత సప్తహం పఠనం



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** పులివెందుల రింగ్ రోడ్డు అలవలపాడు రోడ్డు సమీపాన కొలువై ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో గురువారం భాగవత సప్తహం పఠనం వైభవంగా ముగిసింది. పై కార్యక్రమాలు భూమి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఆయన తండ్రి సోమేశ్వర రెడ్డి సోదరుడు చంద్ర రెడ్డు ల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. భాగవత పఠనం ఏడు రోజులపాటు దాతల సహకారంతో అల్పాహారం అన్నదానం తదిరంవిజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం చివరి రోజు ప్రముఖల ప్రవచనములు నిర్వహించారు. అనంతరం మహిళల చేతుల మీదుగా మంత్రపుష్పం జపిస్తూ ఆలయ ప్రాంగణంలో కలశ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భాగవతా పండితులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గంగిరెడ్డి, అధ్యక్షులు మాదూరు శేషయ్య, రమణారెడ్డి కదిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి, భాగవతం అధ్యక్షులు మహేశ్వరి, దంతాలపల్లి భాగవతం అధ్యక్షులు కర్ణ రామకంచిరెడ్డి, మీడియా యాగంటి బాలకృష్ణారెడ్డి, గీతా మందిరం భాగవత పండితులు పట్టగిత్తపల్లి, ఆంధ్ర శ్రీనివాసుల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# ఆలయ అభివృద్ధికి సహకరించండి

**- ఆలయ ఛైర్మన్ శ్రీరామ సుబ్బయ్య**
**- సాయినాధునికి విశేష పూజలు**

**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** పులివెందుల పట్టణం పార్నపల్లి రోడ్డు మొట్టమొదటగా కొలువైయున్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయినాధునికి విశేష పూజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణం దీపాలంకరణలతో మొ క్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో ఉభయదారులచే తెల్లవారుజామున నుండి షిరిడి సాయి నాధునికి కాకడ హారతి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, తదితర పూజ కైంకర్యాల అనంతరం షిరిడి సాయినాధుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ,ఈ కార్తీకమాసంలో ప్రతిరోజ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉదయము సాయంకాలము దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దీవెనలు ఎందుకున్నారు. అన్నదాన కార్యక్రమాలకు భక్తులు ఎవరైనా వస్తురూపమైన ధన రూపేనా సహాయం చేయదలచిన వారు ఆలయంలో సంప్రదించవలెనని తెలిపారు.



**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా పథకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రతిభకు ప్రోత్సాహాన్ని అందిస్తాం

**- ఫైనల్‌లో విజేతలకు బహుమతులు అందించిన ఎమ్మెల్సీ**





**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** పులివెందుల పట్టణంలోని ధ్యాన్చంద్ మైదానంలో టర్ఫ్ కోర్టులో జరుగుతున్న ఎస్‌జిఎఫ్ వారు నిర్వహించిన 69వ ఏపీ ఇంటర్‌డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ ఆహ్వానం మేరకు గురువారం జరిగిన అండర్–17 హాకీ ఫైనల్ మ్యాచ్ కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా హాకీ ప్లేయర్లను వారు పరిచయం చేసుకొని వారిని ప్రోత్సహించారు. ఫైనల్‌లో విజేతలైన ప్రతిభావంతుల విద్యార్థులకు మూడు బహుమతుల్నీ స్వయంగా ఎమ్మెల్సీ అందజేయడం జరిగింది.

మొదటి స్థానం కడప టీం, రెండవ స్థానం విశాఖపట్నం జిల్లా మూడవ స్థానం పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, క్రీడల్లో పాల్గొనే యువత ప్రతిభకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని ఎమ్మెల్సీ తెలియజేస్తూ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్పూర్తిగా ఆకాంక్షిస్తున్నాము ఈ కార్యక్రమంలో తుగుట్ల రాఘవరెడ్డి క్రీడాకారులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్‌వి కంటి తుడుపు చర్యలే

**- గ్రామ స్వరాజ్యం పట్ల చిత్తశుద్ధి ఉంటే 11వ షెడ్యూల్లోని 29 అంశాలను గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలి ..**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం, పంచాయతీ కార్య దర్శిపేరును పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్చడం ఈ చర్యలను కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ న రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ చర్యలు కేవలము కంటి తుడుపుచర్యలు మాత్రమే అని అన్నారు. గ్రామీణ స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు ,మండల పరిషత్తులు ,జిల్లా పరిషత్తులు నిధులు లేక అధికారాలు లేక నీరసంచి ,నిర్వీర్యమై ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఉత్సవ విగ్రహాలుగా ,ఆరవ వేలుగా ,మేకపోతు గారకాయలుగా తయారయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ,ప్రత్యేకించి సంబంధిత శాఖ మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కళ్యాణ్ కు పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే క్రింద పేర్కొన్న అంశాలు అమలు చేయాలని తులసి రెడ్డి సూచించారు.

1. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం వ్యవసాయం, పశుసంవర్ధన శాఖ, గ్రామీణ గృహ నిర్మాణం ,త్రాగునీరు, గ్రామీణ విద్యుదీకరణ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, దారిద్య నిర్మూలనా పథకాలతో సహా 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాలను గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలి.
2. గ్రామపంచాయతీ వ్యవస్థ రాజ్యాంగ వ్యవస్థ .కానీ వైకాపా పాలనలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాల వ్యవస్థ గ్రామపంచాయతీలకు సమాంతరంగా ఏర్పడిన రాజ్యాంగేతర వ్యవస్థగా తయారైంది. ఇది సమంజసం కాదు. కాబట్టి గ్రామ సచివాలయ వ్యవస్థను గ్రామపంచాయతీ పరిధిలోకి తీసుకొని రావాలి.
3. ప్రతి గ్రామపంచాయతీలలో సంపద కేంద్ర భవనాలు ఉన్నాయి. కానీ ఒక్కటి కూడా వినియోగంలో లేవు. నిర్దిష్ట కాల పరిమితిలో సంపద కేంద్రాలను వినియోగం లోకి తేవాలి.
4. స్వచ్ఛ్ ఆంధ్ర ప్రదేశ్ పేరుకు మాత్రమే .వాస్తవంగా మురికాంధ్రప్రదేశ్గా తయారైంది. స్వచ్ఛ్ ఆంధ్ర ప్రదేశ్ ను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి.
5. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నివేదికను అమలు చేయాలి.

పై అంశాలను అమలు చేసినప్పుడే పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి ,ప్రత్యేకించి పవన్ కళ్యాణ్ కు సూచించారు.

# కూటమి పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

**- వైకాపా కార్యకర్తను కొట్టిన టీడీపీ కార్యకర్త**
**- ఎంపీకి విన్నవించుకున్న బాధ్యుడు రఫీ**



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద రంగాపురం గ్రామానికి చెందిన రఫీని మూడు రోజుల కిందట టిడిపి కార్యకర్త దాడి చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని రఫీ వైకాపా నాయకులు కలిసి విషయాన్ని ఆయనకు తెలియజేశారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన ఎంపి వైయస్ అవినాష్ రెడ్డి తొందర పడొద్దు మనకు మంచి రోజులు వస్తాయి జగనన్న చెప్పిన మాట ప్రకారం మనం నడుచుకుందామన్నారు. కర్మ ఫలాలు ఎవరిని వదిలిపెట్టమన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ లక్ష్మణ్ రెడ్డి, పక్రుదిన్ తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.



# బాలికలు స్వేచ్ఛ భద్రతలపై అవగాహన కలిగి ఉండాలి

**- ప్రభుత్వ పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన**
**- ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి**



**లింగాల– సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ సూచనలతో" రూరల్ సీఐ ఎన్వి రమణ" పర్యవేక్షణ, లో వెలిదండ్ల, గ్రామంలోని ప్రభుత్వ పరిషత్ పాఠశాలలో, గురువారం, విద్యార్థులకు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన లింగాల "ఎస్సై జగదీశ్వర్ రెడ్డి' సైబర్ నేరాలు, ఇటీవలగా మహిళల పట్ల జరుగుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న పరిణామాలపై అవగాహన కల్పించారు. ఇతరుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా వాట్సాప్ ఇన్స్టాగ్రామ్" లో పూర్తి అవగాహనతో కలిగి ఉండాలని, అపరిచితులతో చాటింగ్ చేయడం వారిని ఫాలో కావడం మంచిది కాదని సూచించారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు గాని ఇంట్లో తల్లిదండ్రులకు, కానీ తెలియజేయాలని ఏదైనా సమస్య ఉన్నప్పుడు ధైర్యంగా, ఎదుర్కోవాలని పూర్తిగా విద్యార్థి దశలో మంచి అలవాట్లను ఏర్పరచుకొని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులై, తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. ఎవరైనా ఏదైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే దగ్గరలో ఉన్న 'పోలీస్ స్టేషన్' లో ఫిర్యాదు చేయాలన్నారు. ఇవాళ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మహిళలే, అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో మంచి ఉన్నత పదవులు రాణిస్తున్నారని గుర్తు చేశారు. క్రీడారంగంలో ప్రపంచం గర్వించదగ్గ క్రికెట్ రంగంలో రాణించి ప్రపంచ కప్ సాధించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. మహిళా ప్రపంచకప్ మన రాష్ట్రానికి, మన జిల్లాకు, చెందిన'శ్రీ చరణి" తనదైన శైలిలో కీలక పాత్ర పోషించి ప్రతిభ కనబరిచి ప్రపంచ కప్ గెలుచుకోవడంలో వెన్నెముకగా నిలిచిన విషయం అందరికీ తెలిసిందే అని ప్రతి ఒక్క మహిళ విద్యార్థిని ఆత్మస్థైర్యంతో, ధైర్యంగా ముందుకు వెళ్లాలి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలకు పాదయాత్ర



**లింగాల – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** లింగాల మండలం లింగాల గ్రామం నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధి అయినటువంటి తిరుమలకు పాదయాత్రగా భక్తులు బయలుదేరడం జరిగింది. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పాదయాత్ర ప్రారంభించడం జరిగింది. ఈ పాదయాత్రలో లింగాల గ్రామ భక్తులతో పాటు కర్ణపాపయ్యపల్లి ,గుణకణపల్లి ,పెద్ద కుడాల తదితర గ్రామాల నుంచి సుమారు 30 మంది దాకా బయలుదేరడం జరిగింది. ఈ పాదయాత్రకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా దిగ్విజయంగా పాద యాత్ర పూర్తి కావాలని భక్తులు కోరు కుంటూ బయలుదేరారు వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని వేడుకుంటూ పాదయాత్ర ప్రారంభించడం జరిగిందని పాదయాత్ర ఆర్గనైజర్ అలవలపాటి శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**- ఎమ్మెల్యే షాజహాన్ బాష**



**మదనపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్ బాష హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తబిఖీ చేశారు. తనిఖీ సమయంలో కొంతమంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు విధిగా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఎక్కడ కానీ సమస్యలు లేకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు.

## బొలెరో ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు



**మదనపల్లె– సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** ములకలచెరువు మండలానికి చెందిన ఓ రైతును గురువారం బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతుకు కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెద్దపాళ్యం కు చెందిన రైతు శ్రీరాములు(57) స్కూటీలో పొలం వద్దకు వెళ్లేందుకు బయలు దేరాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన బొలెరో వాహనం స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రైతు శ్రీరాములకు కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో కుటుంబీ కులు బాధితున్ని 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి ప్రథమ చికిత్స అందించి, అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రుయాకి వెళ్లాలని రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరసింహుడు తెలిపారు.

## వేంపల్లి మండలానికి కొత్త జిఎస్డబ్ల్యూఎస్

**- డిప్యూటీ ఎంపీడీవోగా రమణయ్య బాధ్యతలు స్వీకరణ**



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** వేంపల్లి మండలంలో జిఎస్డబ్ల్యూఎస్ విభాగానికి కొత్తగా నియమితులైన డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య పదవి బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తూ నిబద్ధత, నిజాయితీ, సేవాభావం కలిగిన అధికారి గా మంచి పేరును సంపాదించిన రమణయ్య ఇటీవల పదోన్నతి ద్వారా డిప్యూటీ ఎంపీడీవో హోదాకు ఎదిగారు. పదోన్నతి అనంతరం వేంపల్లి మండ లానికి బదిలీ కావడంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమణయ్యను అభినందిస్తూ, వారి నాయకత్వంలో గ్రామ సచివాలయ కార్య కలాపాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా డిప్యూటీ ఎంపీడీవో రామ మోహన్ రెడ్డి, సీని యర్ అసిస్టెంట్ రఘునాథ్ రెడ్డి, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## లొయోలా డిగ్రీ కళాశాలలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్




**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** పులివెందులలోని లొయోలా డిగ్రీ కాలేజ్ పులివెందుల పరిధిలో గురువారం నాడు నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. కాలేజ్ ప్రిన్సిపాల్ జోజి రెడ్డి నాయకత్వంలో, ఆర్ఆర్సి కోఆర్డినేటర్ వి.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కడప బొగపర్వతమ్మ బ్లడ్ బ్యాంక్ వారు, అలాగే హెచ్డిఎఫ్సి బ్యాంక్-పులివెందుల వారు సహకారం అందిం చారు. ఈ శిబిరంలో లొయోలా డిగ్రీ కాలేజ్ పులివెందుల 1, 2వ సంవత్సరం విద్యార్థులు 50 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్య క్రమాన్ని ప్రారంభిస్తూ ప్రిన్సిపాల్ జోజి రెడ్డి రక్తదానం యొక్క మహత్తును విద్యార్థులకు సందేశ రూపంలో తెలియజేశారు. రక్తదానం ద్వారా మనుషుల ప్రాణాలు రక్షించగల శక్తి మన చేతుల్లో ఉందని, విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, కోఆర్డినేటర్లు. కళ్యాణి రెడ్డ, సుదీర్, స్యామ్యూల్, అలాగే ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ రమణ రెడ్డిలు పాల్గొని రక్తదానం చేశారు. కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ రఫీ విద్యార్థుల ప్రోత్సాహం, శ్రద్ధ, క్రమశిక్షణను పర్యవేక్షించారు. లొయోలా డిగ్రీ కాలేజ్ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సమాజ సేవలో మరో ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

## కోర్ కమిటీ సమావేశం





**సింహాద్రిపురం– సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** సింహాద్రిపురం మండలం అంకాళమ్మ గూడూరు గ్రామంలో కోర్ కమిటీ సమావేశ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ అబ్జరవర్లు హిమకుంట్ల కిషోర్ రెడ్డి, హృశికేసవ రెడ్డి, సుదర్శన్ రెడ్డి..భాస్కర్ రెడ్డి, చెన్న కేశవ రెడ్డి, అంకాలమ్మ గూడూరు వైసీపీ నాయకులు అశోక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నర్సారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, వంశీ రెడ్డి, సోమిరెడ్డి,ఆనంద్ రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, అరవింద్ నాథ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, చిన్న శేఖర్ రెడ్డి, గంగరాజు, రాయుడు, భాస్కర్, రితన్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రేలా నాగరాజు, అంకాలమ్మ గూడూరు మహిళా నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి విజయ లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికురుల పని చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని పలు విషయాలు సూచించారు ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం మండల వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కళాకారుడు హుస్సేన్ పీరా మృతి
## కళా రంగానికి తీరనిలోటు

**- కళా పిపాసికి తోటి కళాకారుల ఘన నివాళులు**

**పామిడి –సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు హుస్సేన్ పీరా అనారోగ్యం చేత గురువారం రాత్రి మృతి చెందాడు తోటి కళాకారులు అతని స్వగృహములకు వెళ్లి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పామిడి శ్రీ షిరిడి సాయిబాబా నాటక కళా సమితి ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ తను అర్జునుడు, సత్యహరి శ్చంద్ర, అశ్వత్థామ, ద్రోణుడు, తదితర పాత్రలలో కళాకారునిగా 40 సంవత్సరములు పైబడి జీవించాడని, కళలే తన ఊపిరిగా ప్రాణముగా భావించి కళాభిభాషిగా పేరొందినాడని, పామిడి పెద్దవడుగూరు గుత్తి తదితర మండలాల ఔత్సాహిక కళాకా రులను చేరదీసి కష్టనష్టాలకు, ఓర్చుకొని శ్రమను లెక్క చేయక ఎంతో ఓర్పుతో దాదాపు 200ల పౌరాణిక నాటక ప్రదర్శనలు కల్పించి కళాకారులలో ఉత్సాహాన్ని నింపాడని, స్థానిక షిరిడి సాయిబాబా నాటక కళా సమితికి ఎనలేని సేవలు అందించి తనదైన చెరగని ఒక గుర్తింపు పొందాడన్నారు. ఇతని వల్ల వృత్తి కళాకారులు, ఔత్సాహిక కళాకారులు ఆనందముతో జీవించేవారన్నారు. తదనంతరం నాటక ప్రదర్శనలు కల్పించే నాథుడు అంతరించాడన్నారు. మూడు మండలాల కళాకారులు ఇతని మృతి వార్త విని దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమములో సర్పంచులు దామోదర్ రెడ్డి, సూర్యనారాయణ, ఓబులేష్, షిరిడి సాయిబాబా నాటక కళా సమితి అధ్యక్షుడు సి. వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పామిరెడ్డి, కోశాధికారి నాగరాజు, హార్మోనిస్ట్ సుంకన్న, క్లార్నెట్ మాణిక్యం, తబలిస్ట్ వెంకటేష్, కళాకారులు చంద్రశేఖర్ రెడ్డి తదితర కళాకారులు అభిమానులు శ్రేయోభిలాషులు బంధుమిత్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వైసీపీ సంస్థగతంగా బలోపేతానికే కోర్ కమిటీ సమేవేశం

**సింహాద్రిపురం –సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** వైసీపీ సంస్థగతంగా బలోపేతానికే కోర్ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని సింహాద్రిపురం మండల వైకాపా నాయకులు పేర్కొన్నారు. గురువారం గ్రామాలలో వైసీపీ సంస్థగతంగా బలోపేతం చేయుట కొరకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వారి ఆదేశాల మేరకు సింహాద్రిపురం మండలం తెలికి గ్రామపంచాయతీ లో కోర్ కమిటీ సమావేశ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల పరిశీలకులు ఎక్స్ - మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామమోహన్ రెడ్డి, సాకం నీలవర్ధన్ రెడ్డి, సర్పంచ్లు బాబు రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దేవతపురం బాబు రెడ్డి, శివ రెడ్డి, ఓబులేసు, పరమేశ్వర రెడ్డి, బాబు రెడ్డి, మల్లేశ్వర రెడ్డి, రవికుమార్ రెడ్డి, వి. చెన్నకేశవ రెడ్డి, మహేశ్వర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,మైనారిటీ నాయకుడు ఎమ్ఏ బషీర్, షబ్బీర్ గోవర్ధన్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవారికి.. సింగపూర్ కళాకారుల సంగీత నీరాజనం

## - నేడు అన్నమాచార్య కళామందిరం వేదికగా నిర్వహణ పాత్రికేయుల సమావేశంలో డాక్టర్ మేడసాని మోహన్ వెల్లడి

**తిరుపతి– సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** అన్నమాచార్య సంకీర్తనలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానముల అన్నమాచార్య ప్రాజెక్టు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా సింగపూర్‌కు చెందిన సంగీత కళాకారులచే ప్రత్యేక అన్నమాచార్య సంగీత సేవ కార్యక్రమం డిసెంబర్ 12, 2025 సాయంత్రం 6 గంటలకు తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించనున్నట్లు అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్ గారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ "స్వరలయ ఆర్ట్స్" అనే సింగపూర్ ఆధారిత ప్రముఖ సంగీత సంస్థకు చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన కళాకారులు, ఆ సంస్థ నిర్వాహకులు, గురువులు అయిన "గురు శేషుకుమారి" ఆధ్వర్యంలో, ఎన్నో ప్రసిద్ధ అన్నమయ్య కీర్తనలను భక్తి ప్రపత్తులతో ఆలపించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం



నిర్వహణకు సంబంధించి ఆ సంస్థ తరఫున చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం, అన్నమాచార్య కళామందిరంలో ఈ ప్రత్యేక సంగీత కార్యక్రమం నిర్వహించుటకు అనుమతి ఇవ్వబడింది. సింగపూర్ కళాకారులు ఈ కార్యక్రమాన్ని పూర్తిగా భక్తి భావంతో, టీటీడీ నుండి ఎటువంటి పారితోషికం లేదా ఇతర ఆర్థిక ప్రయోజనాలు స్వీకరించకుండా, స్వచ్ఛంద సేవగా అందించనున్నట్లు తెలియజేశారు.

**అన్నమయ్య కీర్తనలకు దేశ విదేశాల్లో ఖ్యాతి**

అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా నిర్వహిస్తున్న వివిధ సంగీత–సాంస్కృతిక కార్యక్రమాలు, హరినామ ప్రచార యాత్రలు, ఎస్వీబీసీ వంటి భక్తి కార్యక్రమాల ప్రభావంతో అమెరికా, ఇంగ్లండ్, జర్మని, ఆస్ట్రేలియా, ఇండోనేషియా తదితర దేశాలలో కూడా ఎన్నో స్వచ్ఛంద సంగీత సంస్థలచే అన్నమయ్య కీర్తనల ప్రచారం వేగంగా విస్తరించుతున్నట్లు మేడసాని మోహన్ వెల్లడించారు.

శుక్రవారం జరిగే అన్నమాచార్య సంగీత సేవ కార్యక్రమానికి నగర ప్రజలు, శ్రీవారి భక్తులు విశేషంగా విచ్చేసి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

### అంగన్‌వాడీ కార్యకర్తలకు

# నూతన మొబైల్స్ అందజేసిన కలెక్టర్

**తిరుపతి– సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు నూతన శాంసంగ్ 5జి మొబైల్స్ అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో 2,492 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, 97 మంది సూపర్‌వైజర్లకు, 12 మంది బ్లాక్ కో–ఆర్డినేటర్లకు నూతన శాంసంగ్ 5జి మొబైల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా సంక్షేమం, పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, బ్లాక్ కొ ఆర్డినేటర్ లకు 5జి



మొబైల్ ఫోన్లను అందజేయడం జరిగిందని, అంగన్‌వాడీ కార్యకర్తలు విధి నిర్వహణలో భాగంగా చేస్తున్న సేవలను అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు సంబంధించిన వివరాలు నమోదు, ప్రభుత్వ పథకాల అమలులో సమర్థతను పెంచడానికి ఈ మొబైల్స్ ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మొబైల్ ఫోన్స్ ధర ఒక్కొకటి రూ. 14000 వంతున మొత్తం 2601 మొబైల్స్ కి సుమారుగా రూ. 3.64 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. అధునాతన మొబైలు ఫోన్ లు వినియోగించుకుని రోజువారీ విధులలో వేగం పెంచి పారదర్శకంగా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. మొబైల్ పంపిణీ ద్వారా జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ మరింత సులభతరం అవుతుందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి వసంత బాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి వసంత బాయి, నోడల్ ఆఫీసర్ వాసంతి, రేణిగుంట సీడీపీవో కృష్ణవేణి మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కె.వీరలింగేశ్వరరెడ్డి

**- ఏబిఆర్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి**

**- జిల్లా అధ్యక్షులు మంచాల రాజశేఖర్ రెడ్డి**



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** అఖిల భారత రెడ్డి సంఘము వైయస్సార్ జిల్లా ఉపాధ్యక్షులుగా కడపన వీరలింగేశ్వరరెడ్డి ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, ఏపీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు మంచాల రాజశేఖర్ రెడ్డి లు గురువారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మంచాల రాజశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ వైఎస్ ఆర్ కడప జిల్లా ఉపాధ్యక్షులుగా పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలంనకు చెందిన కె. వీరలింగేశ్వరరెడ్డి ని నియామకం జరిగినట్లు తెలిపారు. పదవులు పొందిన వారికి అఖిల భారత రెడ్డి సంఘము తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు అని తెలిపారు. మీ నాయకత్వంలో రెడ్డి యువత, మహిళాలు ఐక్యంగా ముందుకు సాగి, సమాజాభివృద్ధి దిశగా మరింత కృషి చేస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాము. రెడ్డి సమాజం ఐక్యమే మన బలం మీ సేవా ప్రయాణం విజయవంతం కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము అనివారు తెలిపారు.

## విభజన వలన కండలేరు కట్ట మాత్రమే పొదలకూరు ప్రజలకు దక్కుతుంది



**పొదలకూరు – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** అశాస్త్రీయంగా జిల్లాల విభజన కారణంగా కండలేరు జలాశయం నీటి బదులుగా పొదలకూరు రైతులకు మట్టి కట్ట మాత్రమే మిగులుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్ అన్నారు. గురువారం పట్టణంలోని జల వనరుల శాఖ కార్యాలయం ముందు బిజెపి నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా నుండి రాపూరు కలువాయి మండలాలు వేరు చేస్తే కండలేరు డ్యామ్ ను కోల్పోతామన్నారు. డ్యాం నిర్వహణ తిరుపతి జిల్లా అధికారులకు వెళు తుందన్నారు. కరువు సమయంలో నీటి మీద ఉన్న సహజ హక్కులు పొదలకూరు ప్రజలు కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు టౌన్ అధ్యక్షులు సిరిగిరి ఓబులేసు, ఉపాధ్యక్షులు చొప్ప వెంకటేశ్వర్లు, రాచపూటి ధనంజయ రావు, ప్రధాన కార్యదర్శి అక్కెం. జనార్ధన్ రెడ్డి, కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసులు, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు బొడ్డు గురుస్వామి, బల్లి పిచ్చయ్య, రంగారావు, చింతగింజల సుబ్రహ్మణ్యం, పోతురాజు రామ్మోహన్, పాపిశెట్టి శ్రీహరి, వాకా శ్రీనివాసులు, మాజీ మండల అధ్యక్షులు సంగన పెంచలరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

## అఖండ-2 అఖండమైన విజయం సాధిస్తుంది

**అఖండ-2 సినిమా రిలీజ్ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనంతపురం నగరంలో అభిమానులతో కలిసి భారీ బైక్ ర్యాలీ**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** అఖండ–2 సక్సెస్ మీట్ అనంతపురంలోని నిర్వహించాలని కోరుతామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ నటించిన అఖండ–2 అఖండమైన విజయం సాధిస్తుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అఖండ–2 సినిమా రిలీజ్ సందర్భంగా అనంతపురం నగరంలో టిడిపి నాయకులు, నందమూరి బాలకృష్ణ అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగింది. నగరంలోని ప్రధాన వీధుల మీదుగా జై బాలయ్య అంటూ నినాదాలు చేస్తూ ఆ బైక్ ర్యాలీ సాగింది. గౌరీ థియేటర్ లో శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నేను మొదటి నుంచి బాలకృష్ణ అభిమానినని.. ఆయన సినిమా ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో ఒక పండుగ వాతావరణం కనిపిస్తుందన్నారు. అఖండ–2 సినిమా ఈనెల 5వ తేదిన రిలీజ్ కావాల్సి ఉందని.. కొన్ని కారణాల వలన వాయిదా పడిందన్నారు. ఈ సక్సెస్ మీట్ అనంతపురంలో నిర్వహి ంచారన్నారు. ఇప్పుడు అఖండ–2 సినిమా కూడా గ్రాండ్ సక్సెస్ అవుతుందని.. ఈ సినిమా సక్సెస్ మీట్ కూడా అనంతపురంలోనే నిర్వహించాలని బాలక్రిష్ణను కోరుతామన్నారు. అఖండ–2 చిత్రం యూనిట్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆల్ ది బెస్ట్ తెలిపారు.

## జిల్లా ఉద్యమంలో నందమూరి బాలకృష్ణ పాల్గొనాలి....!



**హిందూపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** హిందూపురం జిల్లా ఏర్పాటు కై హిందూపురం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పాల్గొ నాలని అఖిలభారత షహీద్ టిప్పు యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు ఉమర్ ఫరూక్ డిమాండ్ చేశారు. గురువారం నాడు ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ..... గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నందమూరి బాలకృష్ణ హిందూపురం జిల్లా సాధన కు తన వంతు తోడ్పడుతానని మాటిచ్చిన విషయం గుర్తు చేశారు. ప్రస్తుతం ఉద్యమంలో పాల్గొంటే హిందూపురం జిల్లా ఏర్పాటుకు సాధ్యమవు తుందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా హిందూపురం గతంలో కన్నా 100 రెట్లు అభివృద్ధి చెందుతుందని కోరారు. హిందూపురం ప్రత్యేక జిల్లా లేదా కేంద్రంగా ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదని ఉమర్ ఫారూఖ్ ఖాన్ తెలిపారు.

## శ్రీసిటీ ఫేజ్ -2కు భూసేకరణ పనులు వేగవంతం చేయండి

**- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి– సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** శ్రీ సిటీ ఫేజ్ –2 కు సంబందించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలులో శ్రీసిటీ ఫేజ్ – 2 కి సంబందించి వెబ్ ల్యాండ్, ఎల్ జి ఫేజ్–1,2 పెండింగ్ భూసేకరణ పనులు, కోర్టు కేసులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీసిటీ ఫేజ్ –2, ఎల్ జి ఫేజ్ –1,2కు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, సూళ్లూరుపేట ఆర్డిఓ కిరణ్మయి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, సత్యవేడు వరదయ్యపాలెం తహసీల్దార్లు, ఆర్ఐ లు, విఆర్ఓ లు, కలెక్టరేట్ భూసేకరణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అరెస్ట్






**మదనపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** కురబలకోట మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లి డిఎస్పి ఆఫీసులో గురువారం సాయంత్రం అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, ముదివేడు ఎస్ఐ మధురామ చంద్రుడు మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం, అంగళ్లు కేంద్రంగా గంజాయి విక్రయిస్తుండగా వెళ్లి సర్కారు తోపు వద్ద ఏడుగురిని పట్టుకుని వారి వద్ద 6కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టు బడ్డవారిపై ఎన్ డిపిఎస్ ఆక్ట్ కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు. అరెస్ట్ అయిన వారి వద్ద ఏడు మొబైల్ ఫోన్లు, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఈ కేసు లో ఇంకా ఇద్దరు తప్పించు కున్నారని తెలిపారు. అరెస్టయిన వారిలో కరమల ఆవేశ్ అలియాస్ పండు (22), కూరగాయల సురేష్ బాబు అలియాస్ సూరి(30), చల్లా తేజ్ కుమార్ (20), కోటకొండ చిట్టి సాయి(22), సాకే చంద్రశేఖర్ అలియాస్ ఆటో చంద్ర(55), భూమి శెట్టి భార్గవ్ కుమార్ (30), కూని వెంకటరమణ(60) లు ఉన్నారు.

## జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ

**- జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన నిర్వహిస్తున్న పోలీసులు**

**- జిల్లా యస్.పి. డా. అజిత వేజెండ్ల**



**నెల్లూరు – సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** జిల్లా ఎస్.పి. ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సూచనలతో, జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలతో భాగస్వాములయ్యేలా కార్యాచరణ రూపకల్పన. జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఆట కట్టించుటకు ఆయా గ్రామాలలోని గ్రామస్తులు, గ్రామ పెద్దలతో, యువతతో సమావేశం నిర్వహిస్తున్న నెల్లూరు పోలీసులు. అందులో భాగంగా ఆయా పరిధిలోని గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలు, ఆస్థి నేరాలు, నివారణ చర్యలు, సైబర్ మోసాల గురించి, గాంజా, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి, మహిళలు మరియు బాలబాలికలపై జరిగే నేరాలు, ఇతర చట్టాలు, శిక్షలు గురించి ప్రజలకు అవగాహన కలిగిస్తున్న నెల్లూరు పోలీసులు. గ్రామాల్లో తగాదాలు, గొడవలు పడరాదని, అందరూ కలిసిమెలిసి సామరస్యంగా జీవించాలని వారికి తెలియజేయడం జరిగింది. ఇసుక, మద్యం, గంజాయి ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడానికి గ్రామస్థులు సహకారం అందించాలని సూచన. ఆయా పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా. చెడునడత, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్నవారికి పోలీస్ అధికారుల కౌన్సిలింగ్ నిర్వహణ. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారుల హెచ్చరిక. ఎవరికైనా అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే డయల్ 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కి తెలపగలరు.




# వాయిదా పడిన డిసెంబర్ సినిమాలు

నేచర్ లో ఎక్కడో జరిగే మూమెంట్ మరెక్కడో జరిగే మూమెంట్ ను డిసైడ్ చేస్తుందని, దాన్నే బటర్ ఫ్లై ఎఫెక్ట్ అంటారని ఓ సినిమాలో డైలాగ్ ఉంటుంది. అది ముమ్మాటికీ నిజమే. సినీ ఇండస్ట్రీలో కూడా ఒక సినిమా రిలీజ్ డేట్ మరెన్నో సినిమాల రిలీజ్ డేట్స్ ను డిసైడ్ చేస్తూ ఉంటుంది. ఈ మధ్య టాలీవుడ్ లో ఈ సమస్య మరీ ఎక్కువైపోయింది. అఖండ2 డిసెంబర్ 5 నుంచి డిసెంబర్ 12కి వాయిదా వాస్తవానికి డిసెంబర్ నెలలో పలు సినిమాలు షెడ్యూల్ అయ్యాయి. ముందుగా డిసెంబర్ 5కి నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన అఖండ2 తాండవం వస్తుందని అనౌన్స్ చేశారు. దీంతో పలు చిన్న సినిమాలు తమ రిలీజ్‌లను దానికి అనుగుణంగా ప్లాన్ చేసుకున్నాయి. కానీ కొన్ని కారణాల వల్ల అఖండ2 డిసెంబర్ 5న రిలీజ్ అవకుండా వాయిదా పడి డిసెంబర్ 12కి షిఫ్ట్ అయింది. అసలు విషయం ఇదే! దీంతో ఎన్నో సినిమాలు తమ రిలీజ్ డేట్లను మార్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. డిసెంబర్ 12న రిలీజవాల్సిన మోగ్లీ సినిమా ఒక రోజు ఆలస్యంగా డిసెంబర్ 13న రిలీజవుతుండగా, డిసెంబర్ 6న రిలీజవాల్సిన శర్వానంద్ బైకర్ మూవీ కొన్ని కారణాల వల్ల వచ్చే ఏడాది ఫిబ్రవరికి వాయిదా పడింది. ఈషా అనే హార్రర్ మూవీ డిసెంబర్ 12న రావాల్సి ఉండగా అఖండ2 వస్తుండటంతో దాన్ని డిసెంబర్ 25కి పోస్ట్‌పోన్ చేశారు. పోస్ట్ పోన్ అయిన అన్నగారు వస్తారు అక్కడ క్లిక్కయ్యేలా బిగ్ ప్లాన్ డిసెంబర్ 12న రిలీజవాల్సిన సైక్ సిద్ధార్థ అనే సినిమా కూడా అఖండ2 తో పోటీ వద్దనుకుని తమ సినిమాను వాయిదా వేసుకుని జనవరి 1న రిలీజ్ చేయాలని డిసైడ్ అయ్యారు. ఇక కార్తీ నటించిన అన్నగారు వస్తారు సినిమా డిసెంబర్ 12 నుంచి వాయిదా అయితే పడింది కానీ కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడనేది మాత్రం మేకర్స్ ఇంకా అనౌన్స్ చేయలేదు. అడివి శేష్ డెకాయిట్ ఈ నెల 25న రిలీజవాల్సి ఉండగా షూటింగ్ లేటవడం వల్ల ఆ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న రిలీజ్ కానుంది. అంతేకాదు, గుణశేఖర్ దర్శకత్వంలో వస్తోన్న యూఫోరియా సినిమా కూడా డిసెంబర్ 25 నుంచి నెక్ట్స్ ఇయర్ ఫిబ్రవరి 6కి వాయిదా పడింది. డిసెంబర్ 18న రిలీజ్ కావాల్సిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కూఆ వాయిదా పడింది కానీ ఇంకా కొత్త రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయలేదు.

## ‘పెద్ది’ రిలీజ్ డేట్ మారిందా?..
# అసలు విషయం ఇదే!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇప్పుడు ఫుల్ బిజీగా మారిపోయారు. గేమ్ ఛేంజర్ తర్వాత ఆయన ఫోకస్ మొత్తం ‘పెద్ది’ సినిమా మీదే ఉంది. ఉప్పెన డైరెక్టర్ బుచ్చిబాబు సానా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇది ఒక స్పోర్ట్స్ డ్రామా అని, చరణ్ పాత్ర చాలా కొత్తగా ఉంటుందని ఇప్పటికే టాక్ నడుస్తోంది. ఫస్ట్ సాంగ్ ‘చికిరి చికిరి’ కూడా జనాలకు బాగా నచ్చేసింది. దీంతో సినిమా మీద అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అయితే గత రెండు, మూడు రోజులుగా సోషల్ మీడియాలో ఒక వార్త గట్టిగా చక్కర్లు కొడుతోంది. ఈ సినిమా రిలీజ్ డేట్ వాయిదా పడుతుందని, అనుకున్న టైమ్ కు రావడం కష్టమని అంటున్నారు. మొదట ఈ సినిమాను 2026 మార్చి 27న రిలీజ్ చేస్తామని చెప్పారు. కానీ షూటింగ్ లేట్ అవుతుందని, అందుకే మే నెలకు వాయిదా వేస్తున్నారని రూమర్స్ వచ్చాయి. దీంతో మెగా ఫ్యాన్స్ కొంచెం కన్ఫ్యూజన్ లో పడ్డారు, అసలేం జరుగుతుందో అర్థంకాక టెన్షన్ పడ్డారు. కానీ ఇప్పుడు ఈ రూమర్స్ అన్నింటికీ చెక్ పెడుతూ అసలు మేకర్స్ క్లారిటీతో విషయం బయటకు వచ్చింది. ‘పెద్ది’ సినిమా రిలీజ్ వాయిదా పడటం లేదట. ముందు అనుకున్న ప్లాన్ ప్రకారమే మార్చి 27న సినిమాను థియేటర్లలోకి తేవడానికి టీమ్ ఫిక్స్ అయ్యింది. ఇందులో ఎలాంటి మార్పు లేదని, షూటింగ్ కూడా కరెక్ట్ టైమ్ కే పూర్తవుతుందని క్లారిటీ వచ్చేసింది. సోషల్ మీడియాలో వచ్చే గాసిప్స్ నమ్మాల్సిన అవసరం లేదని మేకర్స్ ఓ క్లారిటీ ఇచ్చేశారు. రేపటి నుంచే హైదరాబాద్ లో కొత్త షెడ్యూల్ మొదలుకాబోతోంది. అక్కడ పని అవ్వగానే టీమ్ మొత్తం ఢిల్లీకి వెళ్తుంది. జనవరి చివరి కల్లా సినిమా టాకీ పార్ట్ మొత్తం పూర్తి చేయాలనేది ప్లాన్. ఒకపక్క షూటింగ్ చేస్తూనే, మరోపక్క ఎడిటింగ్, డబ్బింగ్ పనులు కూడా కానిచ్చేస్తున్నారు. కాబట్టి సినిమా లేట్ అయ్యే ఛాన్స్ అస్సలు లేదన్నమాట. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా చేస్తోంది. శివ రాజ్ కుమార్, జగపతి బాబు లాంటి పెద్ద నటులు కూడా ఉన్నారు. వీటన్నింటికి తోడు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. బుచ్చిబాబు కథ, చరణ్ యాక్టింగ్ కలిస్తే థియేటర్లో రచ్చ మామూలుగా ఉండదని ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. ఇప్పుడు రిలీజ్ డేట్ మీద కూడా క్లారిటీ రావడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఇక ‘పెద్ది’ గురించి వచ్చిన వార్తలు కేవలం పుకార్లే అని తేలిపోయింది. ఏ అడ్డంకులు లేకుండా చరణ్ బర్త్ డే కానుకగా మార్చి 27నే సినిమా రాబోతోంది. రాబోయే రోజుల్లో సినిమా నుంచి మరిన్ని క్రేజీ అప్డేట్స్ వచ్చే అవకాశం ఉంది.



## ‘మిస్టర్ కూల్’ తోపాటు
## మిస్టర్ బిజినెస్ : 1000 కోట్ల సామ్రాజ్యాధినేత

దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి.. ఇది అందరి జీవితాల్లో గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం. ముఖ్యంగా రంగుల ప్రపంచం అయిన సినిమాల్లో.. స్వల్పకాలం ఫామ్ తో ఆడే క్రికెట్ లో క్రేజ్ ఉన్నప్పుడే ‘క్యాష్’ చేసుకోవడం అనేది అందరూ చేయాల్సిన ముఖ్యపని.. అలా చేయలేదు కాబట్టే సినీ ఇండస్ట్రీలో ‘సావిత్రి’, రాజనాల లాంటి వారు తమ అంతిమ గడియాల్లో అష్టకష్టాలు పడి మృత్యువాతపడ్డారు.ఇక క్రీడాలోకంలో సచిన్ తో సమానంగా ఆడినా ఆర్థిక పరిణతి కనబరచక ‘వినోద్ కాంబ్లీ’ చివరకు అందరి సాయంతో బతుకు ఇడ్చాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సూత్రం ఒంటబట్టించుకున్న టీమిండియా దిగ్గజ కూల్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని ముందే సర్దుకున్నారు. తను ఎక్కడి నుంచి వచ్చాడు.. ఎలా ఎదిగాడు అన్నది గుర్తు పెట్టుకొని భవిష్యత్తుకు సరైన బాటలు వేసుకున్నాడు. అతడి ఎదుగుదల సినిమాగా వచ్చింది. భావి క్రికెటర్లకు ఆయన జీవితం ఒక ఆదర్శం అనడంలో ఎలాంటి సందేహం లేదు.కోటితో వేలంలోకి మహేంద్ర సింగ్ ధోని.. ఈ పేరు వినగానే క్రీడాభిమనులకు గుర్తొచ్చేది ‘మిస్టర్ కూల్’ వైఖరి.. హెలిక్యాప్టర్ షాట్లు, భారత్ కు ఎన్నో చిర్మస్మణీయ విజయాలను అందించిన కెప్టెన్సీ.. మైదానంలోనూ ఎంత కూల్ గా.. ఫోకస్డ్ గా ఉంటాడో.. వ్యక్తిగత జీవితంలోనూ అంత నిశ్శబ్దంగా తన లక్ష్యాలను ఛేదిస్తాడు ధోని.. అయితే అతనిలో క్రికెట్ కు మించిన మరో కోణం ఉంది. అంచనాల ప్రకారం.. ప్రస్తుతం అతడి వ్యాపారాల విలువ రూ.1000 కోట్లుగా ఉంది. చెన్నైతో బంధం.. అదే ఒంటబడిన వ్యాపార దృక్పథం ధోనీ జీవితంలో కెరీర్ లో చెన్నైకి ప్రత్యేక స్థానం ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభం నుంచి చెన్నై సూపర్ కింగ్స్ తో కొనసాగుతున్న అతడి అనుబంధం కేవలం క్రీడలకే పరిమితం కాలేదు. ఈ బలమైన బంధం ధోని వ్యాపార దృక్పథాన్ని కూడా మార్చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రశాంతంగా.. సుధీర్ఘంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం ధోనీ నైజం. అదే నైజాన్ని వ్యాపార ప్రపంచంలోనూ అమలు చేస్తూ.. వైవిధ్యభరితమైన రంగాలలో పెట్టుబడులు పెట్టారు. ధోనీ ఫోర్ట్ ఫోలియా.. పలు రంగాల్లో పెట్టుబడులు ఎంఎస్ ధోని కేవలం ఒకే రంగంలో కాకుండ భవిష్యత్తులో అపారమైన వృద్ధి ఉన్న పలు వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టారు. ఇక ఎలక్ట్రిక్ సైకిల్స్ కు సంబంధించిన స్టార్టప్ ‘ఈ మోటారాడ్’ భవిష్యత్తు రవాణా వ్యవస్థకు దోహదపడే ఈ రంగంలో ధోని పెట్టుబడులు పెట్టడం అతడి దూరదృష్టికి నిదర్శనం. ఇక చిన్న, మధ్యతరహా వ్యాపారాలకు అకౌంటింగ్ సేవలు అందించే ‘ఖాతాబుక్’ లో కూడా ధోని పెట్టుబడులు పెట్టారు. ఇక ‘సెవన్ బై ఎంఎస్ ధోని’ అనే బ్రాండ్ ద్వారా ఆయన తన లైఫ్ స్టైల్ దుస్తులు, క్రీడా పరికరాల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ‘తగ్దారోహా’ అనే ఫిట్ నెస్, వెల్ నెస్ ఫ్లాట్ ఫామ్ లోనూ ధోనికి వాటాలన్నాయి. క్రికెట్ పిచ్ పై ప్రత్యర్థులను అంచనావేసి ఎలా అయితే విజయం సాధిస్తాడో.. అదే తరహాలో వ్యాపార ప్రపంచంలోనూ భవిష్యత్తు అవకాశాలను అంచనావేస్తూ.. 1000 కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించి ధోని ఇప్పుడు ‘మిస్టర్ కూల్’ తోపాటు మిస్టర్ బిజినెస్ గా కూడా నిరూపించుకున్నాడు.. మైదానంలో ఉన్నట్టుగానే వ్యాపారంలోనూ ధోని లాంగ్ ఇన్నింగ్స్ కు సిద్ధమవతున్నారని స్పష్టమవుతోంది.




## కెప్టెన్, వైస్ కెప్టెనే
# టీమిండియాకు భారం.. లెక్కలివీ!

నడిపించేవాడిని నాయకుడు అంటారు. అలా నడిపిస్తేనే జట్టు ముందుకు సాగుతుంది. విజయాలు సాధిస్తుంది. దీనికి గొప్ప ఉదాహరణ మహేంద్ర సింగ్ ధోని. టీంను ముందుండి నడిపించి విజయాలు సాధించి భారత క్రికెట్ చరిత్రలో గొప్ప కెప్టెన్ గా చిరస్థాయిగా ధోని నిలిచిపోయాడు. తర్వాత వచ్చిన రోహిత్ కూడా అంతే.. జట్టు కోసం వేగంగా ఆడి పరుగులు సాధించి సెల్ఫ్ లెస్ క్రికెట్ ఆడాడు. అయితే ఆ ఒరవడి ప్రస్తుతం కొరవడింది. టీమిండియా కెప్టెన్, వైస్ కెప్టెన్ లే జట్టుకు భారంగా తయారవుతున్నారు.ప్రపంచ క్రికెట్ లో అగ్రగామిగాకొనసాగుతున్న టీమిండియా కెప్టెన్ అంటే ఆటలో ముందుండి జట్టును నడిపించాలి. కానీ ప్రస్తుతం పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. కెప్టెన్ గా ఉన్న సూర్య కుమార్ యాదవ్, వైఎస్ కెప్టెన్ శుభ్ మన్ గిల్ ఇద్దరూ బ్యాటింగ్లో తీవ్రంగా నిరాశ పరుస్తున్నారు. ఇటీవల సౌతాఫ్రికాపై భారత్ ఘనవిజయం సాధించినా.. కెప్టెన్ సూర్యకుమార్, బ్యాటింగ్ మరోసారి అభిమానులను నిరాశపరిచింది. ఇది ఒక్క మ్యాచ్ విషయం కాదు.. గత కొంతకాలంగా సూర్య ఫామ్ టీమిండియాకు పెద్ద తలనొప్పిగా మారుతోంది. సూర్యకుమార్ యాదవ్ గత 23 టీ20 అంతర్జాతీయ ఇన్నింగ్సులు చూస్తే వరుసగా 20, 1, 39లి, 1, 12, 5, 0, 47లి, 7లి, 2, 0, 14, 12, 0, 1, 4, 21, 75, 8, 29, 8, 26, 58 పరుగులు చేశారు. ఒక్క సెంచరీ కూడా లేదు. కేవలం ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉంది. ఈ లెక్కలను గమనిస్తే ఒకటి రెండు మెరుపు ఇన్నింగ్స్ లు తప్ప స్థిరమైన ప్రదర్శన అనిపించేటట్లు కనిపించడం లేదు.కెప్టెన్ స్థాయికి ఇది అస్సలు సరిపోదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక వైస్ కెప్టెన్ శుభ్ మన్ గిల్ ది కూడా అదే పరిస్థితి. అతడి గత 15 టీ20 ఇన్నింగ్స్ లు చూస్తే.. 58, 13, 34, 39, 20, 10, 5, 47, 29, 4, 12, 37, 5, 15, 46 పరుగులు చేశాడు. సూర్యతో పోలిస్తే గిల్ కొంత మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ ఒక వైస్ కెప్టెన్‌గా ఇంకా ఎక్కువ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ అవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జట్టు గెలుపుతో కవర్.. వ్యక్తిగత వైఫల్యాలతో డ్యామేజ్ ప్రస్తుతం టీమిండియా టీ20ల్లో గెలుస్తోంది అంటే దానికి కారణం సమిష్టిగా మిగతా ఆటగాళ్ల ప్రదర్శనే తప్ప కెప్టెన్, వైస్ కెప్టెన్ బ్యాటింగ్ కాదు అన్నది స్పష్టంగా కనిపిస్తోంది. యువ ఆటగాళ్లు, ఆల్ రౌండర్లు కీలక సమయంలో మ్యాచ్ ను మలుస్తున్నారు. ఫామ్ లోకి వస్తే టీమిండియాకు తిరుగుండదు ఒక వేళ సూర్యకుమార్ యాదవ్, శుభ్ మన్ గిల్ లు ఇద్దరూ ఫామ్ లోకి వస్తే మాత్రం భారత జట్టు మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఇప్పటికే బలమైన టీమ్ గా ఉన్న భారత్.. అప్పుడు ప్రత్యర్థులకు కలలా మారిపోతుంది. కెప్టెన్, వైస్ కెప్టెన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆటగాళ్లు వ్యక్తిగత ప్రదర్శనలోనూ ముందుండాల్సిన అవసరం ఉంది. రాబోయే సిరీస్ లలో సూర్య, గిల్ ఫామ్ లోకి రావాలని కోట్లాది మంది అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. లేదంటే ఈ విమర్శలు మరింత తీవ్రమయ్యే అవకాశముందని క్రికెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.



# క్రషర్ ఏర్పాటుపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నాయా?

**- ధనియానిచెరువు గ్రామ సచివాలయంలో ఆర్డీఓ విచారణ**



**కదిరి– సూర్యవస్తవం, డిసెంబర్ 11:** నంబులపూలకుంట మండలం ధనియాని చెరువు గ్రామ పంచాయతీ కోటిరెడ్డిగారిపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్రషర్ ఏర్పాటుపై ఆ గ్రామస్తులతో పాటు క్రషర్ నిర్వహణతో కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మ గురువారం ధనియాని చెరువు గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. మొదట నంబుల పూలకుంట తహసిల్దార్ దేవేంద్ర నాయక్ తన సిబ్బందితో కలిసి కోటి రెడ్డిగారిపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి గ్రామస్తులతో విచారణ చేపట్టారు.

అనంతరం సచివాల యంలో గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి క్రషర్ ఏర్పాటు చేయడంపై గ్రామస్తుల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షుణ్ణంగా అడిగి క్రషర్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఒక్కొక్కరి నుంచి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు క్రషర్ నిర్వాహకుడు సంజీవరెడ్డి సమాధానం ఇచ్చారు. క్రషర్ ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్తులకు, వ్యవసాయ రంగానికి, జీవనాడులకు కానీ ఇతర వాటిపైన ఆ ప్రభావం ఉంటుందా అని ఆర్డిఓ సుదీర్ఘంగా గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఏర్పాటు చేసిన తర్వాత అక్కడ నుంచి వచ్చే దుమ్ము వల్ల ఆ ప్రభావం తమ పంటల పైన పడుతుందని కోటి రెడ్డి గారి పల్లి గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి తో పాటు మరికొందరు ఆర్డిఓకు వివరించారు. తాను ఏర్పాటు చేస్తున్న క్రషర్ అధునాతన టెక్నాలజీతో కూడుకున్నదని దానివల్ల గ్రామస్తులకు కానీ జీవనాడు లకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని నిర్వా హకుడు సంజీవరెడ్డి ఆర్‌డిఓకు సమాధానం ఇచ్చారు. నువ్వు ఏర్పాటు చేస్తున్న క్రషర్‌కు సంబంధించి అవసరమైతే నమూనాను గ్రామస్తులకు చూపించాలని ఆర్డీవో సంజీవరెడ్డిని ఆదేశించారు. గ్రామస్తులు ఎప్పుడు వస్తారో చెబితే వారిని తీసుకెళ్లి నమూనాను చూపించడానికి సిద్ధంగా ఉన్నానని సంజీవరెడ్డి తెలిపారు అనంతరం ఆర్డిఓ గ్రామస్తుల నుంచి తీసుకున్న అభిప్రాయాలను మినిట్స్ పాయింట్ల రూపంలో నోట్ చేసుకున్నారు. క్రషర్ ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో 20 రోజుల లోపు తనకు అందజేయాలని మండల సర్వే ప్రభంజన రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన సిబ్బంది కోటిరెడ్డి గారి పల్లికి చెందిన గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైద్యాధికారుల దాతృత్వం

**- ఎన్‌సిసి విద్యార్థులు శిక్షణ పొందదానికి అవసరమైన డమ్మీ తుపాకులను అందించిన డాక్టర్, శివ కార్తీక్ రెడ్డి**



**పామిడి - సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** పామిడి ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి మిత్ర బృందం ఎన్సిసి విద్యార్థులకు అవసరమైన 10 డమ్మీ ఎస్ ఎల్ ఆర్ తుపాకులను అందజేసి దాతృత్వం చాటుకున్నట్లు పామిడి టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆ పాఠశాల ఎన్‌సీసీ యూనిట్ ఏఎన్ఓ రామాంజనేయులు ఏర్పాటు చేసిన సమావేశానికి వైద్యాధి కారి శివ కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థులు శిక్షణ పొంద డానికి అవసరమైన డమ్మీ తుపాకులను అందజేయడం ఎంతో ఆనందించదగ్గ విషయం అన్నారు. దాతలు చేసిన సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్యుడి చేతుల మీదుగా విద్యార్థులకు తుపాకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి వై.రామాంజన యులు, ఉపాధ్యాయుడు రామ్మోహన్, మాజీ సైనిక అధికారి లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. పామిడి ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి మిత్ర బృందం ఎన్సిసి విద్యార్థులకు అవసరమైన 10 డమ్మీ ఎస్ ఎల్ ఆర్ తుపాకులను అందజేసి దాతృత్వం చాటుకున్నట్లు పామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆ పాఠశాల ఎన్ సీసీ యూనిట్ ఏఎన్ఓ రామాంజనేయులు ఏర్పాటు చేసిన సమావేశానికి వైద్యాధికారి శివ కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్ సి సి విద్యార్థులు శిక్షణ పొందడానికి అవసరమైన డమ్మీ తుపాకులను అందజేయడం ఎంతో ఆనందించదగ్గ విషయం అన్నారు. దాతలు చేసిన సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్యుడి చేతుల మీదుగా విద్యార్థులకు తుపాకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ అధికారి వై.రామాంజనేయులు, ఉపాధ్యాయుడు రామ్మోహన్, మాజీ సైనిక అధికారి లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ సంస్థాగతకు ప్రతీ కార్యకర్త సైనికుడీలా పని చేయాలి

**- గ్రామ పంచాయతీ వైసీపీ నూతన కమిటీల నియామకం**



**వేముల - సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** వేముల మండలం దుగ్గన్నగారిపల్లి, గుండ్లపల్లి, గ్రామ పంచాయతీ వైసీపీ నూతన కమిటీల నియామకం ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పిటిసి కోగటం భయపు రెడ్డి, వేముల ఎంపిపి చల్ల గంగాదేవి వెంకటనారాయణ, వేమా నారాయణ రెడ్డి,చెన్నారెడ్డి,మధు సూదన్ రెడ్డి,చంద్రమోహనరెడ్డి,సాంబశివారెడ్డి, విద్యా సాగర్ రెడ్డి,బ్రహ్మం రెడ్డి,మధు మోహన్ రెడ్డి,ఐటీ విభాగం సుభాష్ రెడ్డి వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీ మెరిట్ లిస్ట్ విడుదల

**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా ఏప్రిల్ మాసంలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదల కు సంబంధించి వివిధ రకాల ఉద్యోగాలు భర్తీ కోసం అప్లై చేసిన వారి సెలక్షన్ మెరిట్ లిస్ట్ విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా సైకాలజిస్ట్, ఆడియోలజిస్ట్,ఆప్తల్మలజిస్ట్, ఫార్మసిస్ట్ అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్, పోస్టులకు సంబంధించి ప్రభుత్వ అధికారిక వెబ్సైటు www.anantapuramu.ap.gov.inలో ఉంచడం జరిగిందని కావున పై ఉద్యోగాలకు అప్లై చేసిన అభ్యర్థులు వారి పేర్లను మెరిట్ లిస్టులో చూసుకోవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈబి దేవి ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు.

# అటవీ అధికారులకు జింక అప్పగింత

**బొమ్మనహాల్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 11 :** బొమ్మనహాల్ మండలంలోని గుంతకల్లు గ్రామ శివారు ప్రాంతం వ్యవసాయ పొలంలోకి వచ్చిన జింక పిల్ల పై గురువారం నాడు కుక్కలు దాడికీ ప్రయత్నం చేయగా వాటి నుండి రైతు కాపాడి బొమ్మనాహాల్‌ఎస్సై నబి రసూల్ సహాయంతో అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అసలు వివరల్లోకి వెళితే.... ఉంతకల్లు గ్రామ శివారులోని బెస్త నాగరాజు తన వరి పొలంలో మేత కోసం వచ్చిన జింకపై పొలం దగ్గర ఉన్న కుక్కలు వెంబడించాయి. అక్కడే పొలం పనుల్లో ఉన్న రైతు గమనించి కుక్కల బారినుంచి జింకను కాపాడి ఎస్ఐ నబి రసూల్ కు సమాచారం అందించగా ఆయన వెంటనే స్పందించి అటవీ అధికారులకు తెలియజేసి వారి ఆదేశాల మేరకు ఫారెస్ట్ వాచర్ బొమ్మన్నాకు అప్పగించారు.



# మహిళల భద్రత, సైబర్ క్రైమ్ ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన

**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబరు 11:** మహిళల భద్రత ,సైబర్ క్రైమ్, ట్రాఫిక్ పై జెఎన్‌టియూ కాలేజ్ విద్యార్థులకు పులివెందుల డియస్పి మురళి, ఇన్‌స్పెక్టర్లు సీతారామిరెడ్డి, హాజివలి అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా డి.యస్.పి, ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజురోజుకు సైబర్ క్రైమ్ రేటు పెరుగుతుందని దీనిపట్ల ప్రతిఒక్కరు పూర్తి అవగాహన తప్పనిసరి అని గుర్తుచేసారు. ఎట్టిపరిస్థితులలో తెలియని వ్యక్తులకు మీ ఓటిపి, బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్ ఎవరికి తెలియచేయవద్దని సూచించారు. అపరిచితుల నుండి వచ్చే లింకులు, మెసేజ్‌లు, కాల్స్ నమ్మవద్దని, డిజిటల్ అరెస్ట్ అనేది అంతా భూటకమని గుర్తుచేసారు. స్క్రీన్ షేరింగ్ యాప్స్ ఎవరితోనూ ఉపయోగించవద్దని లోన్ యాప్స్ నకు దూరముగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం, ఫోటోలు జాగ్రత్తగా ఉంచుకోవలేనని తెలిపారు. మోసపోతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయండి.





**మహిళల భద్రత:** అనుమానాస్పద వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలను దూరంగా ఉంటూ పోలీసులకు తెలియజేయాలని సూచించారు. రాత్రివేళ ఒంటరిగా ప్రయాణించినప్పుడు లొకేషన్‌ను కుటుంబ సభ్యులతో షేర్ చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100 / 1091 / 112 వంటి మహిళా హెల్ప్ లైన్ లకు వెంటనే కాల్ చేయవలెననని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పబ్లిక్‌గా పెట్టకుండా ప్రైవసీ సెట్టింగ్స్ కఠినంగా ఉంచండి. వేధింపులు, స్టాకింగ్, బెదిరింపులు జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. ట్రాఫిక్ విషయంగా ప్రతిఒక్కరు రోడ్డు క్రాస్ చేయు సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, ముందు, వెనుక ప్రక్కన గమనిస్తూ వెళ్ళవలసిందిగా గుర్తుచేసారు. ప్రతి వాహన చోదకులు సెల్ ఫోన్ డ్రైవింగ్, మధ్యము సేవించి వాహనాలు నడుపుట, పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణం చేయుట, అతివేగం వంటి చర్యలకు దూరంగా ఉంటూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.

# భూకబ్జాలు చేసే అలవాటు నాకు లేదు

**- సమాజానికి ఉపయోగపడే వార్తలను రాయాలి - టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి**

**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 11:** ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయాల్సిన అవసరం తమకు లేదని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే వార్తలను జర్నలిస్టులు రాయాలని కోరారు. వాస్తవాలు తెలుసుకోకుండా తనపై అసత్య వార్తలు రాస్తే సహించేది లేదని అలాంటి వారిపై చట్టపరంగా (లీగల్) చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన పరువుకు భంగం కలిగించేందుకు కావాలని కొందరు పత్రికల్లో తప్పుడు రాతలను రాయిస్తున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలనలోనే ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు కంచె వేయడం జరిగిందని చెప్పారు. ఈ విషయం వేంపల్లె ప్రజలందరికి తెలుసు అన్నారు. తాను ఎక్కడా భూకబ్జాలకు పాల్పడిన చరిత్ర లేదన్నారు. మాది వ్యవసాయ కుటుంబం అని రైతు బిడ్డగా వ్యవసాయం చేసుకుంటూ, మరోవైపు ప్రజాసేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చాను తప్పా అక్రమార్జన కోసం కాద న్నారు. తాను



పంచాయితీలు చేసి డబ్బులు సంపాదిస్తున్నానని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. నాకు ఎలాంటి ఫ్యాక్టరీలు గాని, బినామీలు గాని లేవని స్పష్టం చేశారు. పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి జరుగుతున్న వరుస చేరికలను చూసి ఓర్వలేకే, కొందరు గిట్టనివారు తనపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తు న్నారని మండిపడ్డారు. తమ పార్టీ కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఇటివల వేంపల్లెలో చరిస్మా కలిగిన నేతలు టిడిపిలో చేరుతుండడంతో ఓర్వలేకే బురద చల్లడం జరుగుతున్నదని చెప్పారు. జగన్‌ను మానసికంగా దెబ్బ తీస్తున్నారనే కారణంతో కొంత మంది కొన్ని ప్రలోభాలకు గురై సంబంధం లేకున్న తమపై అరోపణలు చేయడం శోచనీయం అన్నారు. ప్రజలకు, నాయకులకు తాను చేతనైనా సహాయం చేస్తానే తప్పా తప్పుడు పనులు చేయనని అన్నారు. భూకబ్జాకు పాల్పడిన ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందో కూడ తనకు తెలియదు అన్నారు. అలాంటి భూమి తాను ఎందుకు కబ్జా చేస్తానని చెప్పారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు నామా వేమ కుమార్, మండల కార్యదర్శి తక్కెల షరీఫ్, జబిబుల్లా, దక్కా రమేష్, బాల కృష్ణారెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, సెట్, ఫయాజ్, మిలిటరి శివ, టిడిపి నేతలు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )